www.aksharadarbar.com
సోమవారం 08, ఏప్రిల్ 2024

అక్షర దర్బార్
voice of the people

తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :59 | సంపుటి :02 | పేజీలు : 06 | వెల : 05

ఆఖరి మజిలీకి అడ్డంకులెన్నో..?

- 30 ఏళ్లుగా గోసపడుతున్న కుంభంపల్లి గ్రామస్తులు
- 10 కిలోమీటర్ల దూరంలో శ్మశాన వాటిక
- కర్మకాండల సమయంలో మహిళలకు తప్పని తిప్పలు
- మాటుపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు

03

మానుకోటలో త్రిముఖ పోరు

రెండోసారి ఛాన్స్ ఎవరికో..?

02

ఈ సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని లోకసభ స్థానాలు ప్రత్యేకతను చాటుతున్నాయి.. అందులో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఒకటి. ఎస్టీలకు కేటాయించిన స్థానం ఇది. పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇక్కడి నుంచి మొదటిసారి ప్రాతినిధ్యం వహించన వారే కావడం గమనార్హం. ఒక్కోసారి ఒక్కో అభ్యర్థి గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టారు. మూడు ప్రధాన పార్టీల నేతలు ఇక్కడి నుంచి గెలిచి చట్టసభలో కూర్చున్నారు. చైన్ సిస్టంలా ఒక్కోసారి ఒక్కొక్కరూ గెలుస్తుండగా.. మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఈ ఉత్కంఠ పోరులో ఎవరిని అదృష్టం వరిస్తుందో ఫలితం వెలువడేదాకా చూడాల్సిందే.

–అక్షర దర్బార్, మహబూబాబాద్

- అభ్యర్థుల మధ్య హోరాహోరీ..
- ప్రధాన పార్టీల వారు ఇక్కడి నుంచే మొదటిసారి ఎంపిక
- చైన్ సిస్టం ఎవరిని ఢిల్లీకి తీసుకెళ్తుందో..
- రసవత్తరంగా మహబూబాబాద్ ఎంపీ స్థానం

సీఎం రేవంత్ రెడ్డికి తప్పిన ముప్పు

04

ఉగాది తర్వాత ప్రచారంలోకి కేసీఆర్

13న చేవెళ్లలో బహిరంగ సభ

04

కవితకు బెయిల్ నిరాకరణ

04

- జోరుగా క్రయ విక్రయాలు
- యువతే లక్ష్యంగా వ్యాపారం..
- అడపా దడపా కేసులు నమోదు చేస్తున్న పోలీసులు
- పిల్లల ప్రవర్తను తల్లిదండ్రులు గమనించాలి

మహానగరంలో మత్తు..

02

గ్రేటర్ వరంగల్ గంజాయి గుప్పుమంటోంది. యువతే లక్ష్యంగా అక్రమ వ్యాపారం సాగుతోంది. నగరంలో జోరుగా క్రయ విక్రయాలు కొనసాగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. పోలీసులు నిఘా పెట్టినా ఎలా ఎవరికి చేరాలో వారికి చేరిపోతున్నదనే ఆరోపణలు ఉన్నాయి. సిగరెట్లలో గంజాయి పెట్టుకుని పీల్చడమే కాకుండా విద్యార్థులకు చాక్లెట్లలో పెట్టి అలవాటు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల కాలంలో గంజాయితో పట్టుబడ్డ వారి సంఖ్య పెరిగింది. నిఘా మరింత పెంచి గంజాయిని పూర్తిగా అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

- అభ్యర్థుల మధ్య హోరాహోరీ..
- ప్రధాన పార్టీల వారు ఇక్కడి నుంచే మొదటి సారి ఎంపిక
- చైన్ సిస్టం ఎవరిని ఢిల్లీకి తీసుకెళ్తుందో..



రెండోసారి ఛాన్స్ ఎవరికో..?

రసవత్తరంగా మహబూబాబాద్ ఎంపీ స్థానం

అక్షర దర్బార్, మహబూబాబా : ఈ సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని లోకసభ స్థానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అందులో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఒకటి. ఎస్టీలకు కేటాయించిన స్థానం ఇది. పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇక్కడి నుంచి మొదటి సారి ప్రాతినిధ్యం వహించన వారే కావడం గమనార్హం. ఒక్కోసారి ఒక్కో అభ్యర్థి గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టారు. మూడు ప్రధాన పార్టీల నేతలు ఒక్కోసారి గెలిచి చట్టసభలో కూర్చున్నారు. చైన్ సిస్టంలా ఒక్కోసారి ఒక్కొక్కరు గెలుస్తుండగా.. ఈ ఉత్కంఠ పోరులో ఎవరిని అదృష్టం వరిస్తుందో ఫలితం వెలువడేదాక చూడాల్సిందే.

వేగంగా అభ్యర్థుల ఎంపిక

మహబూబాబాద్ స్థానానికి సిట్టింగ్ ఎంపీ, మాజీ ఎంపీలు బరిలో నిలిచారు. ఈ స్థానం కోసం ప్రధాన పార్టీల నేతలు పోటీ పోటీగా అభ్యర్థుల ఎంపిక చేశారంటే అతిశయోక్తి కాదు. బీఆర్ఎస్ నుంచి 2014లో గెలిచిన ప్రొఫెసర్ సీతారం నాయక్ ను బిజెపి తమ పార్టీలో కలిపేసుకుంది. చకచకా చర్చలు జరపడం. ప్రొఫెసర్ ను బిజెపిలోకి వచ్చేలా ఒప్పించడం, అతనికే టికెట్ కేటాయించడం శరవేగంగా జరిగిపోయాయి. అంతే స్పీడ్ గా కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఆయా పార్టీల నాయకత్వం ప్రకటించింది. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపి కవితకే మరోసారి గులాబి దళపతి కేటాయించారు. ఈ స్థానం నుంచి గెలిచిన ఏకైన గిరిజన మహిళగా ఆమె గుర్తింపు తెచ్చుకున్నారు. 2009లో ఈ స్థానం నుంచి గెలిచి కేంద్ర మంత్రిగా పనిచేసిన బలరాంనాయక్ కే కాంగ్రెస్ అదిష్టానం మొగ్గు చూపింది. నాల్గవ సారి బరిలో ఉన్న ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అభ్యర్థుల ఎంపిక పూర్తి కావడంతో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు గ్రామాల బాట పట్టారు. ఎవరికి వారు ప్రచారంలో బిజీగా మారిపోయారు.

ఎవరి అంచనాల్లో వారు..

కాంగ్రెస్, బిజెపి. బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించన వారే. 2009లో గెలిచిన పోరిక బలరాం నాయక్ కేంద్ర మ్రంతిగా పనిచేశారు. ఆ సమయంలో నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. పదేళ్లుగా బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండగా ఈ సారి కాంగ్రెస్ కు ప్రజలు అవకాశం కల్పిస్తారనే ధీమాతో ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం ఆయనకు కలిసచ్చే అంశం. 2014,2019 ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి వస్తుందనే ఆశతో ఉన్నారు. కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేసిన సీతారాం నాయక్ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 2014లో సీతారాం నాయక్ కు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి గెలిపించుకుంది. అలా ఆయన మొదటిసారి లోకసభలో అడుగుపెట్టారు. ఈ సారి బిజెపి అభ్యర్థిగా బరిలో దిగిన ఆయన గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. దేశంలో మోదికి ఉన్న చరిష్మా కలిసి వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపి కవిత పోటీలో నిలిచారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పై ప్రజలకు భ్రమలు తొలుగుతాయనే ఆశతో ఉన్నారు. ప్రచారంలో ముందు వరుసలో ఉండటం ఆమె అదనపు బలం. తన తండ్రి మాజీ మంత్రి రెడ్యానాయక్ సంపూర్ణ సహకారం ఉండటంతో గెలుపుపై ఆమె ధీమాగా ఉన్నారు. ఈ ముగ్గురిలో ఎవరు రెండోసారి లోకసభలో అడుగుపెడతారో వేచి చూడాల్సిందే.

గుప్పుమంటున్న గాంజ..!

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి :

- నగరంలో జోరుగా క్రయ విక్రయాలు
- యువతే లక్ష్యంగా వ్యాపారం..
- తుతు మంత్రంగా కేసులు నమోదు
- పిల్లల ప్రవర్తను తల్లిదండ్రులు గమనించాలి

గ్రేటర్ వరంగల్ గంజాయి గుప్పుమంటోంది. యువతే లక్ష్యంగా అక్రమ వ్యాపారం సాగుతోంది. నగరంలో జోరుగా క్రయ విక్రయాలు కొనసాగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. పోలీసులు నిఘా పెట్టినా ఎలా ఎవరికి చేరాలో వారికి చేరిపోతున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాలంలో గంజాయితో పట్టుబడ్డ వారి సంఖ్య పెరిగింది. నిఘా మరింత పెంచి గంజాయిని పూర్తిగా అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

చెడు అలవాట్లకు లోనై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి . లేదంటే మూల్యం చెల్లించక తప్పదు. గంజాయి, మత్తు పదార్థాలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిందే. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వెలుగు చూస్తున్న గంజాయి చాక్లెట్ల కలకలం. ఆకు, సిగరెట్లు, పొడి, లిక్విడ్ రూపంలో గంజాయి రవాణా, అమ్మకాలు చేసే మాఫియా ఇప్పుడు చాక్లెట్ల రూపంలోకి మార్చి చిన్న పిల్లలను సైతం గంజాయికి బానిసలుగా మార్చుతున్నారు. గతంలో గంజాయి, డ్రగ్స్ చాలా అరుదుగా ఎక్కడో అక్కడ కనిపించేది. ప్రస్తుతం చిన్న చిన్న ఊళ్ళకూ కూడా పాకడం మేల్కోవాల్సిన అంశం. పిల్లలు ఇష్టంగా చాక్లెట్లు తింటారని అందులో గంజాయి కలిపి అమ్మకాలు చేయడం దురదృష్టకరం. వారికి అసలు గంజాయి అంటే ఏంటో కూడా తెలియదు కానీ వారు అలవాటు పడడం దారుణ పరిస్థితి. విద్యార్థుల అమాయకత్వం లక్ష్యంగా పాఠశాలల వద్ద కొందరు ఈ దందా సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత గంజాయి, మత్తుపదార్థాల బారిన పడకుండా వారి భవిష్యత్తు దృష్ట్యా మత్తు పదార్థాలు సరఫరా, ఉత్పత్తి చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారు.

దుష్ప్రభావాలు..

యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడ్డ సంఘటనలు లేకపోలేదు. మత్తుకు అలవాటు పడిన పిల్లలను తొలి దశలో గుర్తించలేని తల్లిదండ్రులు ఆలస్యంగా తెలుసుకొని తమ పిల్లలకు కౌన్సిలింగ్ ఇప్పిస్తూ మామూలు స్థితికి తీసుకొచ్చేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. గంజాయి వాడే వారి మానసిక ప్రభావాలు మరింత స్పష్టంగా, తీవ్రంగా మారతాయి. వారిలో ఆందోళన, నిరాశ, మానసిక స్థితిలో విఫరీతమైన మార్పులు సంభవిస్తాయి. కళ్ళు ఎర్రబడటం, నోరు పొడిబారడం, మగతగా ఉండటం, జ్ఞాపకశక్తి తగ్గడం, బలహీనమైన శరీరాకృతి, హార్ట్ రేటు పెరగడం, తీవ్రమైన వికారం, వాంతులు ఉంటాయి. తల్లిదండ్రులు అప్రమత్తంగా లేకపోతే అనేక ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉన్నాయి. పిల్లలు కాలేజీలకు వెళ్తున్నారా లేదా, ఎవరితో తిరుగుతున్నారు, ఏం చేస్తున్నారు అనే అంశాలపై దృష్టి సారించాలి. పిల్లల ప్రవర్తనలో ఏమాత్రం తేడా కనిపించినా తల్లిదండ్రులు అప్రమత్తం కావాల్సిందే.

నార్కోటిక్ బ్యూరో స్పెషల్ ఆపరేషన్

- తెలంగాణ స్టేట్ నార్కోటిక్ బ్యూరో అధికారులు స్పెషల్ ఆపరేషన్ చేస్తున్నారు. వరంగల్ మట్టెవాడ పోలీసుల సహకారంతో గంజాయి సరఫరా చేసే నిందితుడు షేక్ రాజును పాపయ్యపేట చమన్ వద్ద ఫిబ్రవరిలో పట్టుకున్నారు. అతని వద్ద కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సేవిస్తున్న మరో ముగ్గురు వ్యక్తులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- శనివారం రోజున ఉదయం 11 గంటల సమయంలో ఇస్లామియా కాలేజ్ గ్రౌండ్ వద్ద ఇద్దరు వ్యక్తులు బండిపై కూర్చుని సిగరెట్ తాగుతున్నారు. అప్పుడే అటుగా వచ్చిన పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని గమనించి వారు పారిపోతుండగా అనుమానంతో వారిని వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. ఉర్సు కు చెందిన రేణిగుంట్ల అరుణ్, పోచమ్మమైదాన్ కు చెందిన జన్ను విలాస్ గా గుర్తించారు. గత కొంత కాలంగా గంజాయిని గుర్తుతెలియని వ్యక్తుల వద్ద 10 గ్రాములకు రూ.500 చొప్పున కొనుగోలు చేసి సేవిస్తున్నట్లు విచారణలో వెల్లడించారు. ఈ క్రమంలో ఒక్కొక్కరు 20 గ్రాముల గంజాయిని కొనుక్కొని సిగరేట్లలో గంజాయి పెట్టుకుని తాగుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు.
- వరంగల్ మీదుగా రైల్వే ప్రయాణ సదుపాయం ఉండటం ఈ ప్రాంతం గుండా అధికంగా ఇతర రాష్ట్రాల నుంచి రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తరుచు రైళ్లలో తనిఖీలు చేస్తూ రవాణా చేస్తున్న వారిని పట్టుకుంటున్నారు. మూడు రోజుల క్రితం రూ.50లక్షల విలువ చేసే ఎండు గంజాయిని పోలీసులు రైల్లో స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న మహరాష్ట్రకు చెందిన ఇద్దరు మహిళలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు.

తరగతి గదిలో మొబైల్ చూస్తూ కాలక్షేపం చేస్తున్న ఉపాధ్యాయురాలు

విధుల్లో అలసత్వమే..
ఆ పంతులమ్మ విధానం..

- ఇష్టానుసారంగా విధుల్లోకి..
- ఫైనల్ ఎగ్జామ్స్ సమీపిస్తున్నా పూర్తి కాని సిలబస్
- సెల్ ఫోన్ తో కాలక్షేపానికి లక్షల జీతాలు..

అక్షర దర్బార్, ఖానాపురం: విధుల్లోకి ఆలస్యంగా రావడమే కాకుండా మిగితా సమయాన్ని కూడా సెల్ ఫోన్ తో కాలక్షేపం చేయడమే పని అన్నట్లుగా ఓ ఉపాధ్యాయురాలు వ్యవహారం ఉంది. ఆమె విధుల్లో ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని స్థానికులు వీడియో, ఫోటోలు తీసి సోమవారం మీడియాకు పంపించారు. ప్రభుత్వం లక్షల్లో జీతాలు అందిస్తూ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించమంటే కొంతమంది ఉపాధ్యాయులు మాత్రం విలువైన పని వేళల్ని మొబైల్ ఫోన్ లకు అంకితం చేస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో ఫైనల్ ఎగ్జామ్స్ ఉన్న నేపథ్యంలో సిలబస్ కూడా సరిగా పూర్తిచేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటు సిలబస్ పూర్తి చేయకుండా, అటు సమయపాలన పాటించకుండా సెల్ ఫోన్ లో కాలక్షేపం చేయడమే ప్రధాన ఘనకార్యంగా చేస్తున్న ఉపాధ్యాయుల తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఖానాపూర్ మండలం బుధరావుపేట మోడల్ పాఠశాలలో పరిస్థితి ఇది. పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయులు మొబైల్ ఉపయోగించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ సదరు ఉపాధ్యాయురాలు మాత్రం సెల్ ఫోన్ లో లీనమవ్వడం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆగ్రహం తెప్పిస్తోంది. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

కుంభం పల్లికి, మానేరు నదికి మధ్యలో అడ్డుగా ఉన్న కుంభం మాటు

- 10 కిలోమీటర్ల దూరంలో శ్మశాన వాటిక
- కిలోమీటర్ దూరంలో మానేరు వాగు
- మార్గమధ్యలో కుంభం మాటు
- నడుము లోతు నీళ్లలో నుంచి మృత దేహం తరలింపు
- కర్మకాండల సమయంలో మహిళలకు తప్పని తిప్పలు
- మాటుపై కల్వర్టు నిర్మించాలని గ్రామస్థుల వేడుకోలు

ఆఖరి మజిలీకి
అడ్డంకులెన్నో..!
30 ఏళ్లుగా గోసపడుతున్న కుంభంపల్లి గ్రామస్తులు

అక్షర దర్బార్ మల్హర్ : మనిషి ఆఖరి మజిలీకి సరైన దారి లేక కుంభంపల్లి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొండంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కుంభంపల్లి గ్రామంలో సుమారు 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మనిషి ఆఖరి మజిలీ కష్టాలు తీర్చడానికి గత ప్రభుత్వం సుమారు రూ.12 లక్షల వ్యయంతో కొండంపేట గ్రామ సమీపంలో స్మశాన వాటిక నిర్మించింది. కానీ కుంభంపల్లి గ్రామ పంచాయతీకి 10 కిలో మీటర్ల దూరంలో ఉండడంతో గ్రామంలో ఎవరైనా చనిపోతే వారిని స్మశాన వాటికకు తీసుకెళ్లడం ప్రజలకు తలకు మించిన భారంగా మారుతోంది. ఒకవేళ వ్యయ ప్రయాసాల కోర్చి వెళ్లామంటే వల్లెంకుంట, కొయ్యూరు, ఎడ్లపల్లి ఎక్స్ రోడ్ మీదుగా మూడు గ్రామాలు దాటి కొండంపేట స్మశాన వాటికకి చేరుకోవాల్సి ఉంటుంది. దీంతో ఇబ్బందుల దృష్ట్యా గత కొన్నేళ్లుగా కుంభంపల్లిలో ఎవరైనా చనిపోతే గ్రామానికి కిలో మీటర్ దూరంలో ఉన్న మానేరు నదిలో అంత్య క్రియలు నిర్వహిస్తున్నారు. గ్రామం నుంచి మానేరు నదికి వెళ్లే మార్గంలో కుంభం మాటు ఉండడంతో మృతదేహాన్ని నిలువెత్తు నీళ్లలోతు నుంచి ప్రాణాలకు తెగించి తీసుకు వెళ్లాల్సి ఉంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంభం మాటుపై కల్వర్టు నిర్మిస్తే ఇబ్బందులు తీరుతాయని వారు కోరుతున్నారు. గతేడాది నవంబర్ లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్ బాబుకి తమ ఇబ్బందులు విన్నవించగా సానుకూలంగా స్పందించి కుంభం మాటుపై కల్వర్టు నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, అధికారులు స్పందించి మాటుపై కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని వారు కోరుతున్నారు.

అంత్యక్రియలకు తిప్పలవుతోంది..
ములుకల్ల రాజేశ్వర్ రెడ్డి, కుంభంపల్లి

గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి దహన సంస్కారాలకు మానేరు నదికి తీసుక వెళ్లాలంటే మస్తు తిప్పలవుతుంది. మార్గమధ్యలో కుంభం మాటులో నిలువెడు నీళ్లు ఉండడం వల్ల దాటుడు కష్టం అవుతుంది. అధికారులు స్పందించి మాటుపై కల్వర్టు నిర్మించాలి.

30 ఏళ్లుగా గోస పడుతున్నాం..
వేమునూరి తిరుపతి ,కుంభంపల్లి

దహన సంస్కారాల కోసం 30 ఏళ్లుగా గోస పడుతున్నాం.. మాటులో నీళ్లలో నుంచి మృత దేహాన్ని తీసుక పోవడం కష్టంగా ఉంది. వానాకాలంలో ఎవరైనా చనిపోతే ఇంకా గోస తప్పదు.. కర్మ కాండలు జరప డానికి వెళ్లే సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాటుపై కల్వర్టు నిర్మిస్తే మా బాధలు తీరుతాయి.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం, కాంగ్రెస్ నాయకులు

రంజాన్ పవిత్రమైనది

మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్

నర్సంపేట పట్టణంలో ఇఫ్తార్ విందు

అక్షర దర్బార్, దుగ్గొండి : ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని నర్సంపేట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 22వ డివిజన్ తాజ్ కుర్షిదా మసీదులో ఇఫ్తార్ విందును వేముల సాంబయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మోల్ సాబ్ సాహెబ్ రాజా, ఎండీ అఖిల్ పాషా, ముస్లిం పెద్దలు ఎండీ ఆఫీస్, ఎండీ ఖలీల్, ఎండీ జలీల్, ఎండీ మహబూబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్, నాయకులు దండెం రతన్ కుమార్, పట్టణ కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ యూఐ అధ్యక్షుడు కటారి ఉత్తమ్ కుమార్, 22వ డివిజన్ జనరల్ సెక్రెటరీ తొగరు దేవేందర్, నాయకులు జిజుల కార్తీక్, దేశి సందీప్, రాసమల్ల బాలు పాల్గొన్నారు

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, పరకాల : వరంగల్ లోక్సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని ఆయన నివాసంలో సంగెం మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ గూడ సుదర్శన్ రెడ్డి, మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, నాయకులు పులుగు సాగర్ రెడ్డి, దొనికెల మల్లయ్య, ఉండీల రాజు, బొంపెల్లి దిలీప్ రావు, షాబోతు శ్రీనివాస్, గుగులోతు వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

తాగునీటికి సమస్య ఫిర్యాదులకు
హెల్ప్ డెస్క్..
పరకాల మున్సిపల్ చైర్ పర్సన్

అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపల్ పరిధిలో ప్రజలకు వేసవికాలం దృష్ట్యా తాగునీటికి సంబంధించిన సమస్యలకు ఫిర్యాదు కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ సోమవారం తెలిపారు. ఫిర్యాదుల కోసం 24 గంటలు 99 890 91103 నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. తాగునీటిపై ఎలాంటి సమస్యలు ఉన్నా హెల్ప్ డెస్క్ నెంబర్ కు కాల్ చేసి తెలపాలని ఆమె కోరారు.

నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో
పెరుగుతున్న సెక్షన్ రేట్..

- మొదటి కాన్పులు అధికంగా సెక్షన్..
- కట్టడి చేస్తారా కామన్ అంటారా
- తగ్గుతున్న సాధారణ ప్రసవాలు..

నర్సంపేట, అక్షర దర్బార్ : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీల సెక్షన్ రేట్ క్రమంగా పెరుగుతోంది(సాధారణ ప్రసవాలు తగ్గుతున్నాయి). సాధారణ కాన్పులు చేయాల్సిన వైద్యులు కోతల వైపు దృష్టి పెడుతున్నారా అనేది తెలియాల్సి ఉంది. జనవరిలో మొత్తం 121 ప్రసవాలు కాగా మొదటి కాన్పులు 46, అందులో సాధారణ ప్రసవాలు 19 కాగా, 27 సెక్షన్ అంటే 58 శాతంగా ప్రైమరీ సెక్షన్ రేట్ ఉండగా మొత్తం జనవరిలో 66శాతం ప్రసవాలు సెక్షన్లు కావడం గమనార్హం. ఫిబ్రవరిలో మొత్తం 89 ప్రసవాలు కాగా మొదటి కాన్పులు 33, అందులో 17 సాధారణ ప్రసవాలు 16 సెక్షన్ అంటే 48 శాతం సెక్షన్ రేట్. మార్చిలో మొత్తం 96 ప్రసవాలు కాగా అందులో మొదటి కాన్పులు 37 అయ్యాయి. 37లో సాధారణ ప్రసవాలు 13కాగా 24 సెక్షన్ లే అంటే 64శాతంగా సెక్షన్ రేట్ ఉంది. జనవరి, ఫిబ్రవరితో పోల్చుకుంటే మార్చిలో సెక్షన్ రేట్ పెరిగింది. పెరుగుతున్న సెక్షన్ రేట్ ను జిల్లా ఆసుపత్రి పెద్దలు కట్టడి చేస్తారా లేక కామన్ అంటారా అనేది రోజులు గడిస్తే తెలుస్తుంది. వాస్తవానికి నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి నార్మల్ అంటే ఫార్మల్ అనే పేరు ఉండేది.. అది కాస్త క్రమ క్రమంగా దూరం అవుతోంది.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

కాంగ్రెస్ తోనే దేశాభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

- కడియం కావ్య గెలిపించుకుందాం..
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, రేగొండ : కాంగ్రెస్ పార్టీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం గోరికొత్తపల్లి మండల కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వరంగల్ ఎంపీగా కడియం కావ్యను గెలిపించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం నుంచి లక్ష మెజారిటీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. నియంతృత్వ పాలనతో దేశాన్ని మోడీ, రాష్ట్రాన్ని కేసిఆర్ ఆగం చేశారని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వంద రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి 30 లక్షల సీసీ రోడ్లు అమలు చేశానని అన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ కత్తి వెంకటస్వామి, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జిల్లా పార్టీ అధ్యక్షులు, క్రెడ్ కార్పొరేషన్ చైర్మన్ అయితే ప్రకాష్ రెడ్డి, ఆర్ఎస్ఆర్ సంస్థ చైర్మన్ కటంగూరి రాంనర్సింహారెడ్డి, ఎన్ఎస్ఆర్ సంపత్ రావు, చెల్పూర్ సింగిల్ విండో చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, నాయకులు గుటోజు కిష్టయ్య, సూరం వీరేందర్, పత్తి తిరుపతి, కానుగంటి బ్రహ్మం, వావిలాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది తర్వాత ప్రచారంలోకి కేసీఆర్

- 13న చేవెళ్లలో బహిరంగ సభ

అక్షర దర్బార్, హైదరాబాద్ : ఉగాది తర్వాత లోక్ సభ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ దిగనున్నారు. ఇప్పటికే లోక్ సభ నియోజకవర్గాల వారీగా సమావేశాలు కొనసాగుతున్నాయి. 13న చేవెళ్లలో బహిరంగ సభ నుంచి కేసీఆర్ తన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు పదేళ్ల తమ హయాంలో చేపట్టిన పనులను వివరిస్తూ గులాబీ పార్టీ లోక్ సభ ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లనుంది. 16 స్థానాలకు అభ్యర్థులు ఖరారు కాగా వరంగల్ అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. కడియం కావ్య అనుభవం నేపథ్యంలో అభ్యర్థి ఎంపిక విషయంలో బీఆర్ఎస్ ఆచితూచి వ్యవహరిస్తోంది. అభ్యర్థిని ప్రకటించేందుకు మరికొంత సమయం తీసుకోవచ్చని అంటున్నారు. ఈ దఫా ఎక్కువగా బస్సుయాత్రలు, రోడ్ షోల ద్వారా ప్రచారం నిర్వహించేందుకు కేసీఆర్ సిద్ధమయ్యారు. అన్ని నియోజకవర్గాలను చుట్టి వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కేసీఆర్‌తో పాటు కేటీఆర్,హరీశ్ రావు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.

ఘనంగా విశ్వదీప్తి వార్షికోత్సవం

అక్షర దర్బార్, మల్హర్ : కొయ్యూర్ విశ్వదీప్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాల 8వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్, ఎంకే సుదర్శన్, డైరెక్టర్లు, ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. పాఠశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబుద్ధులు నేర్పుతూ తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యానందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ఏకైక పాఠశాల విశ్వదీప్తి అని అన్నారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అలరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎస్సై సతీమణి స్వప్న, జర్నలిస్టులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

విద్యార్థులకు పట్టాలు అందజేసిన పాఠశాల యాజమాన్యం

డెయిరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

నాగార్జున డెయిరీ ప్రారంభం..

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలో నాగార్జున డెయిరీని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే తో పాటు నాగార్జున డెయిరీ ఎండీ పుల్లూరి ప్రభాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, సీఈవో కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పరకాల ఎంపీపీ తక్కళ్లపల్లి స్వర్ణలత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ హరిప్రసాద్, ఏకు రాజు, ఒంటేరు సారయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, నాగార్జున డెయిరీని ప్రారంభించిన బొమ్మ అశోక్ ను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు అభినందించారు. ఆయన వెంట ఆరె సంక్షేమ సంఘం విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు మోతే చిరంజీవి, రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్, బీఆర్ఎస్ నాయకులు జూపాక భాస్కర్, నాగరాజు ఉన్నారు.

పొంచి ఉన్న ముప్పు..

- ప్రధాన రహదారికి పక్కనే ఎండిపోయిన భారీ వృక్షం
- ఎప్పుడు కూలుతుందోనని వాహనదారుల ఆందోళన

నర్సంపేట, అక్షర దర్బార్ : నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిపై లక్నేపల్లి సమీపంలో ఎండిపోయిన ఓ భారీ వృక్షం వాహనదారులకు భయాదోళనకు గురిచేస్తోంది. పూర్తిగా ఎండిపోయిన భారీ వృక్షం ఎప్పుడు కూలుతుందోనని వారు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఎండిన చెట్టును అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. విషయాన్ని గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ విశ్వ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా స్థానిక కార్యదర్శికి చెప్పి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎండిపోయి ప్రమాదకరంగా మారిన చెట్టు

సీఎం రేవంత్ రెడ్డికి తప్పిన ముప్పు

అక్షర దర్బార్, హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. రేవంత్ రెడ్డి కొడంగల్ పర్యటనలో భాగంగా సీఎం కాన్వాయిలోని టీజీ 09 ఆర్ఆర్ 0009 నంబర్ గల వాహనం టైర్ ఒక్కసారిగా పేలింది. వెంటనే అలర్ట్ అయిన అధికారులు వాహనానికి మరమ్మతులు చేయించారు. వికారాబాద్ జిల్లా మన్నెగూడ వద్ద ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

కవితకు బెయిల్ నిరాకరణ

అక్షర దర్బార్, ఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు రౌస్ అవెన్యూ కోర్టులో చుక్కెదురైంది. కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్ పై విచారణ చేపట్టిన కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. తన చిన్న కుమారుడికి పరీక్షలు ఉన్నందున ఈ నెల 16 వరకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. మరోవైపు కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దని ఈడీ వాదించింది.

అమ్మ ఆదర్శ కమిటీలదే కీలక పాత్ర

అక్షర దర్బార్, ఖానాపూర్: పాఠశాల్లో మౌలిక సదుపాయల కల్పనలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలదే కీలక పాత్ర అని ఎంఈవో రత్నమాల అన్నారు. సోమవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంఎన్వో చరణ్ సింగ్, ఏపీఎం సుధాకర్ , ఏఈ శోభన్ తో కలిసి హెచ్ఎం, చైర్పర్సన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల నిర్వహణతో పాటు విద్యాభివృద్ధిలో అమ్మ కమిటీలదే పూర్తి భాధ్యత అన్నారు. వేసవిలోనే అన్ని రకాల పనులు పూర్తి చేసేలా కమిటీ చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, చైర్పర్సన్లు, సెర్ప్ సీసీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

ఆర్అండ్ఆర్ ప్లాట్ల పరిశీలన

అక్షర దర్బార్, మల్హర్ : తాడిచెర్లలోని కాపురం ఓసీపీ బ్లాక్-1 ఉపరితలంలో ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో భాగంగా ప్లాట్లు కేటాయిస్తామని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సర్వేనంబర్ 610, 614 లో 8 ఎకరాల భూసేకరణలో భాగంగా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్ పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి అవినాష్, తహసీల్దార్ రవి కుమార్, ఏఎమ్మార్ పీఆర్వో మల్లేష్, ఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు